గంజాయి విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి



ఏసీపీకి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్లు

సుభాష్‌నగర్: బస్తీలలో అమాయకమైన యువకులను టార్గెట్ చేస్తూ గంజాయి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరారు. బుధవారం సూరారం పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, స్థానిక సీఐ భరత్ కుమార్‌లను సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సుభాష్ నగర్ కార్పొరేటర్ హేమలతా సురేష్‌రెడ్డి, జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ కలిసి మాట్లాడారు. కొన్ని నెలలుగా బస్తీల్లో, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో గంజాయి విక్రయిస్తూ అనేకమంది యువకులను మత్తుకు బానిసలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ద్వారా బస్తీలలో నిత్యం రాత్రి అయ్యిందంటే గొడవలు జరుగుతున్నాయని ఏసీపీకి వివరించారు. గంజాయిని కట్టడి చేయడమే కాకుండా, జరగబోయే బోనాల పండుగ వరకు బస్తీలో గొడవలు సృష్టించే వారిపై నిఘా పెట్టి కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీస్ అధికారులను కోరారు.

సెంట్రింగ్ సామాను చోరీ చేస్తూ పట్టుబడ్డ దొంగ



స్క్రాప్ యజమాని చంద్రశేఖర్‌ను విచారిస్తున్న పోలీసులు

సుభాష్‌నగర్: కొన్ని రోజులుగా నిర్మాణంలో ఉన్న ఇళ్ల వద్ద విలువైన స్టీల్ సామాగ్రిని దొంగతనం చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దొంగను ఎట్టకేలకు స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గాజులరామారం డివిజన్ మహాదేవపురం కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల దగ్గర నిర్మాణ సామాగ్రి(ఇనపత్వాలు, సెంట్రింగ్ డబ్బాలు, సెంట్రింగ్ జాకీలు)ని దొంగతనాలకు ఓ వ్యక్తి పాల్పడుతున్నాడు. సదరు వ్యక్తి నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద స్టీల్ దొంగతనం చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న కాలనీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అక్కడ చేరుకొని దొంగతనం చేసిన వ్యక్తిని ప్రశ్నించగా.. స్థానికంగా ఉన్న స్క్రాప్ యజమాని చంద్రశేఖర్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దొంగతనం చేసిన వ్యక్తిని, కొనుగోలు చేసిన చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వేల రూపాయలు విలువ చేసే సామాగ్రిని సదరు దొంగ కేవలం వందల రూపాయలకు చంద్రశేఖర్‌కు విక్రయిస్తున్నాడు. అక్రమంగా సామాగ్రిని కొనుగోలు చేస్తున్న స్క్రాప్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీ సెంటర్ ముందే పార్కింగ్



రంగారెడ్డినగర్: అక్రమ పార్కింగ్‌లకు వెల్ఫేర్ అసోసియేషన్ భవన ప్రాంగణం అడ్డాగా మారింది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గురుమూర్తినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ముందు స్థానిక ఇళ్ల వాసులతో పాటు ఇతరులు తమ కార్లు, ట్రాలీ ఆటోలను నిలుపుతున్నారు. ఇదే భవనంలో అంగన్‌వాడీ సెంటర్ నడుస్తోంది. అంగన్‌వాడీ సెంటర్ ఎదుటే వాహనాలు నిలుపుతుండటంతో తమ చిన్నారులకు అపాయం పొంచి ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడా స్థలం లేదన్నట్లు అంగన్‌వాడీ సెంటర్ ఎదుట వాహనాల పార్కింగ్ చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు, అధికారులు కల్పించుకుని వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

మోతీనగర్: విద్యుత్ పనులు చేసే క్రమంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని మెట్రో జోన్ సీఈ సాయిబాబా అన్నారు. బుధవారం మోతీనగర్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రీన్‌ల్యాండ్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వారం రోజుల పాటు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించి కార్మికులు విధులు నిర్వహించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సూచనలు ప్రతి కార్మికునికి అర్థమయ్యే విధంగా తెలిపామన్నారు. విధులకు హాజరయ్యే ముందు ప్రశాంతంగా ఉంటూ విధుల్లో పాల్గొంటే ప్రమాదాలు జరగకుండా ఉండటానికి ఆస్కారం ఉంటుందన్నారు.

నియోజకవర్గంగా నిజాంపేట్?

- పునర్విభజనలో రెండుగా ఏర్పడే అవకాశం
- నిజాంపేట్ కార్పొరేషన్‌లో సుమారు 5.50 లక్షల జనాభా
- వివిధ పార్టీల నాయకుల్లో పెరుగుతున్న ఆశలు

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)లో భాగంగా రెండు నియోజకవర్గాలుగా ఏర్పడనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోనే అత్యధికంగా జనాభా, ఓటర్లు ఉన్న నియోజకవర్గాల్లో కుత్బుల్లాపూర్ ఒకటి. ఇక్కడ సుమారు 7.39 లక్షల ఓటర్లతో పాటు సుమారు 20 లక్షల వరకు జనాభా సైతం ఉంది. గతంలో మేడ్చల్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న కుత్బుల్లాపూర్ 2009లో నియోజకవర్గంగా ఏర్పడింది. మొదటి సారి జరిగిన ఎన్నికల్లో నాడు స్వతంత్ర అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉండటంతో కుత్బుల్లాపూర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సైతం ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.



నిజాంపేట్ భౌగోళిక స్వరూపం

మారనున్న భౌగోళిక స్వరూపం

2027లో నిర్వహించే జనాభా లెక్కల ప్రక్రియ పూర్తవ్వగానే కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.మరో 34 వరకు కొత్తవి ఏర్పడనుండటంతో ఈ సంఖ్య 153 వరకు పెరిగే అవకాశం ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఎక్కువ అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఇందులో మొత్తం 14 నియోజకవర్గాలు ఉండగా మరో 9 నియోజకవర్గాలు పెరగనున్నాయి. దీంతో కుత్బుల్లాపూర్ సైతం ఉంది. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రస్తుత భౌగోళిక సరిహద్దులు పూర్తిగా మారిపోయే అవకాశాలు ఉన్నాయి. జనాభా లెక్కలు పూర్తి కాగానే ఆరు నెలల్లో డీలిమిటేషన్ పక్రియ పూర్తి చేయనున్నట్లు సమాచారం.

మహిళా రిజర్వేషన్ అమలు...

వచ్చే సాధారణ ఎన్నికల నాటి నుంచి మహిళా రిజర్వేషన్ 33 శాతం అమలు కానుండటంతో తెలంగాణలో 50 స్థానాలు మహిళలకు రిజర్వు చేయనున్నారు. దీంతో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరగనుంది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న ఓటర్ల ప్రకారం మహిళ ఓటర్లు 45 శాతం పైగా ఉన్నారు. దీంతో పునర్విభజనలో నిజాంపేట్ ప్రాంతం నియోజకవర్గంగా ఏర్పడిన తరువాత మహిళలకు రిజర్వ అయ్యే అవకాశాలు సైతం ఎక్కువగానే ఉన్నాయి.

నిజాంపేట్ కార్పొరేషన్ కేంద్రంగా నియోజకవర్గం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లతో పోటీ పడే స్థాయిలో ప్రస్తుతం నిజాంపేట్ కార్పొరేషన్‌లోనే సుమారు 5.50 లక్షల వరకు జానాభా ఉంది. 1.50 లక్షల వరకు ఓటర్లు ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని నియోజకవర్గం ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కార్పొరేషన్ పరిసర ప్రాంతాలైన శేరిలింగం పల్లిలోని నిజాంపేట్‌ను ఆనుకుని ఉన్న హైదర్‌నగర్ డివిజన్, బాచుపల్లిని ఆనుకుని ఉన్న మియాపూర్ ప్రాంతం, అదే విధంగా బొల్లారం, దుండిగల్ మున్సిపల్, ప్రగతినగర్‌ను ఆనుకుని ఉన్న గాజులరామారం డివిజన్ లాంటి ప్రాంతాలను అవసరమైన మేరకు తీసుకుని ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

నాయకుల ఆసక్తి

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నియోజకవర్గంగా ఏర్పడితే ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసే నాయకుల సంఖ్య సైతం తీవ్రంగానే ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో పోటీ దారులు ఎక్కువగానే ఉంటారు. ఇటు గాజులరామారం, హైదర్‌నగర్, దుండిగల్ మున్సిపాలిటీలు ఇలా ఏ ప్రాంతాలు భౌగోళికంగా ఇందులో కలిసిన ఆ ప్రాంతాల్లోని నాయకులు సైతం ఇక్కడ పోటీలో నిలిచేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తుంది.

బ్యాంక్ సేవలను విస్తృతం చేయాలి

ఎమ్మెల్యే వివేకానంద్



సర్టిఫికెట్‌తో ఎమ్మెల్యే వివేకానంద్, పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు

కుత్బుల్లాపూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ (పీఏసీఎస్) సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దూలపల్లి పీఏసీఎస్‌కు ఐఎస్ఓ, హెచ్‌వైఎం సర్టిఫికెట్ లభించిన సందర్భంగా గురువారం బ్యాంక్ చైర్మన్ గిరిసె నరేంద్రరాజు నేతృత్వంలో బ్యాంక్ డైరెక్టర్లు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. బ్యాంక్‌కు ఐఎస్ఓ 9001:2005, హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్ మధుసూదన్, మల్లేష్, కృష్ణయాదవ్, నరేందర్, మధుసూదన్, మదన్ రావు, సత్యనారాయణ, సీఈవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగు అప్పగించిన పోలీసులు



అనితకు బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

జీడిమెట్ల: ఆభరణాలు, నగదుతో కూడిన బ్యాగును బాధితురాలికి పోలీసులు శ్రమించి నాలుగు గంటల్లోనే అప్పగించారు. జీడిమెట్ల డిటెక్టీవ్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య వివరాల ప్రకారం.. గాజులరామారం చంద్రగిరినగర్‌కు చెందిన అనిత ఆమె సోదరితో కలిసి ఆసుపత్రికి ఆటోలో షాపూర్‌నగర్‌కు వచ్చింది. షాపూర్‌నగర్‌లో దిగి ఆసుపత్రికి వెళ్లి చూసుకోగా రూ.50 వేలు, 3 గ్రాముల బంగారం ఉంచిన బ్యాగు కనిపించలేదు. దీంతో ఆమె జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన జీడిమెట్ల క్రైం పోలీసులు నాలుగు గంటల పాటు శ్రమించారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించారు. డ్రైవర్ నుంచి బ్యాగు, రూ.50వేలు 3గ్రాముల బంగారాన్ని తిరిగి అనితకు అప్పగించారు.

దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నిజాంపేట్: పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలి ఇచ్చే 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. దేశమంతటా పూర్తి స్థాయిలో లేబర్ కోడ్స్ అమలులోకి రాకముందే జమ్మూకాశ్మీర్‌లో 420 యూనియన్ల రిజిస్ట్రేషన్‌లను ఆ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా రద్దు చేసిందన్నారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని పది గంటల పని దినంగా నిర్ణయించిందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో లేబర్ కోడ్స్ సాకుతో కార్మిక సంఘాల, కార్మికుల హక్కులు హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు కార్మిక వర్గాన్ని బానిసలుగా కేంద్ర ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు. సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నయ్య, సత్యనారాయణ, నాగేషు, నరసింహ, బాలస్వామి, నరసింగరావు, రమేష్, మనీ, లక్ష్మి, యాదమ్మ, వెంకటమ్మ, బుజ్జమ్మ, అలివేలు, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా కార్యవర్గ సభ్యులు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు



సన్మానిస్తున్న సతీష్‌సాగర్ తదితరులు



సుభాష్‌నగర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు రామచంద్రరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రామచంద్రరావును శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందరం దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, విగ్నేష్, కార్పొరేటర్ రావుల శేషగిరి, రాష్ట్ర నాయకుడు శ్యామ్ రావు, సెన్సార్ బోర్డు మెంబర్ నటరాజ్, కొంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రాజారెడ్డి, శివాజీ రాజు, శేఖర్ యాదవ్, యువ మోర్చా సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ రేవతిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పత్తి నతీష్, పులి బలరాం, కంది శ్రీనివాస్, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రామచంద్రరావుని బుధవారం ఆయన నివాసంలో ఆ పార్టీ నాయకులు కలిసి సన్మానించారు. బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కన్వీనర్ శేఖర్ యాదవ్ పగిడి పెట్టి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, ప్రసాద్ రాజు, డివిజన్ ఉపాధ్యక్షులు గండిరాజు యాదవ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్. రాంచందర్‌రావును బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో పలువురు నేతలు బుధవారం కలిసి సన్మానించారు. తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు.

భారీగా జన సమీకరణ చేయాలి



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎమ్మెల్సీ సారయ్య, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నిర్వహించనున్న సమ్మేళన సభను విజయవంతం చేయాలని, భారీగా జనసమీకరణ చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. గాజులరామారంలోని సిటీ ప్యాలెస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించే గ్రామ స్థాయి, డివిజన్ అధ్యక్షుల సమ్మేళన సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కోఆర్డినేటర్స్ శశికళ యాదవరెడ్డి, గజ్జెల కాంతం, ఏపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగిపడ్డ విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం

జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ రోడ్డు నెంబర్ 2లో ఘటన



తెగిపడిన విద్యుత్ వైర్లు

కుత్బుల్లాపూర్: విద్యుత్ వైర్లు తెగి పడడంతో ఆ కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ రోడ్డు నెంబర్ 2లో మంగళవారం రాత్రి కురిసిన వర్షం వల్ల స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రాత్రి సమయం కావడం.. కాలనీవాసులు రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడంతో జనసంచారం లేక ఊపిరి పీల్చుకున్నారు. తెగిపడ్డ వైర్లకు విద్యుత్ సరఫరా అవుతున్న విషయాన్ని గుర్తించిన కాలనీవాసులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే అధికారులు అర్ధరాత్రి 12 గంటల వరకు మరమ్మతులు చేపట్టారు. తాత్కాలికంగా వైర్లను జాయింట్ చేసి లైన్ పునరుద్ధరించారు. శాశ్వత పరిష్కారం కోసం రెండు విద్యుత్తు స్తంభాలు అవసరమని, ఒక్కో స్తంభానికి మరో స్తంభానికి దూరం ఉండటం వల్ల వైర్లు తెగిపడ్డాయి. ఈ విషయంపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశామని సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రాకేష్ కుమార్, నాగరాజు తెలిపారు. కుత్బుల్లాపూర్ ఏడీఈ శ్రీకాంత్, పేట్ బషీరాబాద్ ఏఈ జ్ఞానేశ్వర్ బుధవారం కాలనీని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

13 నుంచి ఆవాజ్ రాష్ట్ర మహాసభలు



సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్

కుత్బుల్లాపూర్: మైనార్టీల పేదరికం, నిరక్షరాస్యత నిర్మూలనతో పాటు లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకు పనిచేస్తున్న ఏకైక సంఘం ఆవాజ్ అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ మేడ్చల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జులై 13, 14 తేదీల్లో గద్వాల పట్టణంలో జరిగే ఆవాజ్ తృతీయ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు మహాసభల్లో పాల్గొననున్నారని తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీల స్థితిగతులపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. మైనార్టీలపై గో రక్షణ పేరుతో మూక దాడులు చోటు చేసుకుంటున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఆవాజ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా ఫయాజ్, ప్రధాన కార్యదర్శిగా గౌస్, కోశాధికారిగా ముక్తార్, ఉపాధ్యక్షుడిగా జాకీర్, అడ్వైజర్‌గా బురాన్ తదితరులు నియమితులయ్యారు.

'మొక్క'వోని దీక్ష !

- వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక కార్యాచరణ
- 2025-26లో 70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయం



సాక్షి,సిటీబ్యూరో: మళ్లీ 'మొక్క'వోని దీక్షతో వనమహోత్సవానికి కార్యాచరణ ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వర్షాలు ప్రారంభంకావడంతో ఈనెల రెండోవారం నుంచి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు పురపాలక సంఘాలు, మున్సిపల్ సర్కిళ్లు, ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను ఖరారు చేసిన అధికారులు.. స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

ప్రకృతి సమతుల్యత...

సమృద్ధిగా వర్షాలు కురవాలంటే సాధారణంగా అటవీ విస్తీర్ణం కనీసం 33 శాతం ఉండాలని అటవీశాఖ పేర్కొంటున్నప్పటికీ, నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మాత్రం పరిస్థితి విరుద్ధంగా ఉంది. పట్టణీకరణతో కాంక్రీట్ జంగల్‌గా మారుతున్న శివారు పురపాలికల్లో ఆ లోటును అధిగమించేందుకు పుర యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవానికి శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా మొక్కలను నాటాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను అధికార యంత్రాంగం ఖరారు చేయడంతో అందుకు అనుగుణంగా ఆయా శాఖలు కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి.

6 మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యాచరణ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాదిలో 70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. శివారు 16 పురపాలక సంఘాల్లో వనమహోత్సవంలో భాగంగా బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, ఎంసీపల్లి, అలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీలతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని 6 మున్సిపల్ సర్కిళ్లలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

10 శాతం ఔషధ, పండ్ల మొక్కలు

వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటికి రోజూ నీళ్లు అందించడం, ఎరువు తదితర సంరక్షణ కార్యాచరణ సిద్ధం చేశారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా టీజీఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో తూంకుంట, కండ్లకోయ, దూలపల్లిలోని 3 నర్సరీలు, 16 పురపాలక సంఘాలలోని నర్సరీల్లో లక్ష్యానికి తగినట్లుగా మొక్కలు పెంచుతున్నారు. ఈసారి వనమహోత్సవంలో గతేడాది నాటిన మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పచ్చదనం.. భూ పరిరక్షణ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పచ్చదనాన్ని పెంచడంతో పాటు కబ్జాకు గురౌతున్న ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, చెరువు శిఖం భూముల పరిరక్షణే లక్ష్యంగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అర్బన్ పార్కులతో సహా పల్లె , పట్టణ ప్రాంతాల్లో ప్రకృతి వనాల లక్ష్యంగా వనమహోత్సవం విజయవంతం చేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. రహదారుల పక్కన, విద్యా సంస్థలు, చెరువుగట్లు, ప్రైవేటు రంగ సంస్థల కార్యాలయాల్లో వెంచర్లు, లే అవుట్లు, శ్మశానవాటికల్లో మొక్కలను విరివిగా నాటాల్సి ఉంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సాక్షి సిటీబ్యూరో: వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వనమహోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే మొదలైనందున ఈసారి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాల న్నారు.